# From Faith to Faith

## విశ్వాసం నుండి విశ్వాసం వరకు

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు శుభములు తెలియజేయుచున్నాము. ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము గనుక దీనియందు ఉత్సహించి ఆనందించేదము. దేవుడు మరియొక దినమును వాక్యమును ధ్యానించుట చదువుటకు వాక్యంలో అనేక ఆత్మీయమైన గూఢమైన దేవుని యొక్క వాక్య మర్మములను తన యొక్క ఆత్మ ద్వారా మనకు బోధిస్తున్నాడు. ఎందుకనగా ఆయన స్వరం నేటికి సజీవంగా ఉంది. నిన్ను, నీ కుటుంబాన్ని రక్షించుటకు దేవునికి మహిమ కలుగును గాక!

నేడు మనం ధ్యానిస్తున్న వర్తమానం విశ్వాసం నుండి విశ్వాసం వరకు అనగా మనం విశ్వాసం ఆరంబించినప్పటి నుండి విశ్వాసం తుదముట్టించు వరకు విశ్వాసం ద్వారా దేవుడు మన జీవితంలో చేసిన చేస్తున్న కార్యములు. ఎఫీసీయులకు 2:8 మీరు విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. ఇక్కడ వాక్యంలో విశ్వాసం అంటే నమ్మకం మార్కు 16:16. నమ్మి బాప్తీస్మము పొందువాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడును. దేవుని యందు విశ్వాసం ఉంచి బాప్తీస్మము పొంది ఆయన పరిపూర్ణ నామంలో ప్రభువైన యేసుక్రీస్తు నామంలో బాప్తీస్మము పొందాలి. అపోస్తలుల కార్యములు 4:12, 10-48, 19-1, 2:38,39, పేతురు – మీరు మారు మనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తీస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. ఈ వాగ్ధానము మీకును మీ పిల్లలకును దూరస్తులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారికందరికి చెందునని వారితో చెప్పెను 1కొరింథియులకు 6:11 మీలో కొందరు అట్టివారై యుంటిరి గాని, ప్రభువైన యేసుక్రీస్తు నామమున మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి,



పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి.

విశ్వాసం యొక్క మొదటి మెట్టు నీతికరణ అనగా దేవుని యొక్క వాక్యాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొనుట. దేవుని వాక్యంతో నడుచుట ఇక విశ్వాసం అనగా ప్రభువైన యేసుక్రీస్తు ఎవరు ఆయన లోకంలోనికి వచ్చి తన ప్రాణాన్ని ఎందుకు పెట్టాడు. సిలువలో ఎందుకు రక్తం కార్చాడు. మరణం నుండి మూడవ దినమందు ఎందుకు తిరిగి లేచాడు. ఎక్కడికి వెళ్లాడు, మళ్లీ ఇక్కడికి ఎందుకు తిరిగి వస్తున్నాడు. తిరిగి దేవుడు నీకు ఏమి ఇస్తాడు. ఎందుకు నీకు తన యొక్క వాక్య ప్రత్యక్షతను బయలుపరుచుకున్నాడు. నీకు నిత్యజీవం ఎప్పుడు ఎలా ఇస్తాడు అనే అనేక విషయాలు దేవుడు ఇచ్చిన విశ్వాసం ద్వారా పైన పేర్కొనబడిన ఆత్మీయ విషయములను నీకు తెలియపరుస్తాడు. విశ్వాసానికి కర్తయు దానిని కొనసాగించువాడైన యేసుక్రీస్తు వాక్యంలో పరిశుద్ధాత్మ దేవుడు నిన్ను రక్షిస్తాడు. దేవునికి స్తోత్రములు హల్లేలూయ. ప్రభువైన యేసుక్రీస్తులో మనం ఎలా గుర్తించబడుతాము. దేవునిలో నీ స్థానమును ఎలా గుర్తిస్తావు. దేవుడు నీకు ఇచ్చిన విశ్వాసం ద్వారా ఆ యొక్క విశ్వాసం ద్వారా పరిపూర్ణ వాక్యాన్ని నీవు దేవుని యెద నుండి పొందుకోగలుగుతావు యోహాను 17:7. సత్యంయందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము దేవుని యొక్క వాక్య సత్యాలను విశ్వాసం ద్వారా నీవు పొందుకుంటావు. దేవుని ఆత్మ వాక్యంగా మార్చబడినది ఆ యొక్క వాక్యం మళ్లీ దేవుని యొక్క ఆత్మ ఆలోచనలతో తిరగి ఆత్మ ద్వారా సర్వసత్యాన్ని దేవుడు నీకు ఇవ్వబడిన విశ్వాసం ద్వారా సర్వసత్యాన్ని నీకు బయలుపరుస్తున్నాడు.

దేవుడు నీకు విశ్వాసం ఇచ్చి తనయొక్క వాక్యంలో తన యొక్క వధువు సంఘంలో తన శరీరంలో నీవు దేవుని కుమారుడవని లేక దేవుని యొక్క కుమార్తెవని నిను విశ్వాసం ద్వారా రుజువు చేస్తున్నాడు. మరియు నీకు నీతికరం శుద్ధీకర అగ్ని ఆత్మ వలన నడిపిస్తున్నాడు. తన యొక్క పరలోక రాజ్యం వైపు

నడిపిస్తున్నాడు గలతీయులకు 3:26 వచనంలో యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులైయున్నారు.

దేవుడు తన యొక్క వాక్యాన్ని ఆలోచనలను తన యొక్క సర్వపరిపూర్ణతను విశ్వాసం ద్వారా నీకు తెలియపరుస్తున్నాడు. ఫిలిప్పీయులకు 2:5 క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సును మీరును కలిగియుండుడి ఎఫెస్సీయులకు 4:30 దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి, విమోచన దినం వరకు ఆయన యందు మీరు ముద్రించబడియున్నారు. దేవుని పిల్లలారా! ఇప్పుడు మనయొక్క విశ్వాసానికి ఆత్మ నడిపింపు అవసరం. ఆత్మతో నడుచునప్పుడు నీ విశ్వాసం ద్వారా దేవుడు బలమైన కార్యాలు చేస్తాడు. ఎందుకనగా క్రియలు లేని విశ్వాసం మృతమని దేవుని వాక్యం సెలవిస్తుంది.

యాకోబు 2:14:26 నా సహోదరులారా క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసం కలదని చెప్పిన యెడల ఏమిటి ప్రయోజనము? అట్టి విశ్వాసము అతన్ని రక్షించగలదా? సహోదరుడైనా, సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేక ఉన్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక సమాధానముగా వెళ్లుడి, చలి కాచుకొనుడి, తృప్తిపొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? అలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగానే ఉండి మృతమైనదగును. అయితే ఒకడు నాకు విశ్వాసం ఉన్నది. నాకు క్రియలు ఉన్నవి. క్రియలు లేకుండా నీ విశ్వాసము నాకు కనపర్చుము. నేను నా క్రియల చేత నా విశ్వాసమును నీకు కనపర్చుదునని చెప్పును. దేవుడు ఒక్కడే అని నీవు నమ్ముచున్నావు. అలాగు నమ్ముట మంచిదే. దయ్యములు నమ్మి వణుకుచున్నవి. వ్యర్థుడా! క్రియలు లేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలుసుకొనగోరుచున్నావా? మన పితరుడైన అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిపీఠము మీద అర్పించినపుడు అతని క్రియల వలన నీతిమంతుడని తీర్పుపొందలేదా? విశ్వాసము అతని క్రియలతో కూడా కార్యసిద్ధి కలుగజేసెననియు క్రియల



మూలముగా అతని విశ్వాసము పరిపూర్ణమైనదనియు గ్రహించుచున్నావుగదా? కాబట్టి అబ్రాహాము దేవుని నమ్మెను. అది అతనికి నీతిగా ఎంచబడెను. అను లేఖనము నెరవేర్చబడెను. మరియు దేవుని స్నేహితుడని అతనికి పేరు కలిగెను. మనుష్యుడు విశ్వాసము మూలంగా మాత్రమే కాక క్రియల మూలముగా నీతిమంతుడని యెంచబడునని నెను. మీరు దీనివలన గ్రహించితిరి. అటువలెనే రాహాబు వేశ్య కూడా దూతలను చేర్చుకొని వేరొక మార్గమున వారిని వెలుపలికి పంపివేసినపుడు క్రియల మూలంగా నీతిమంతురాని ఎంచబడెనుకదా? ప్రాణము లేని శరీరము ఎలాగో మృతమో, అలాగే క్రియలు లేని విశ్వాసము మృతము.

ప్రియ దేవుని కుమారులారా, కుమార్తెలారా! దేవుడు మీకివ్వబడిన విశ్వాసం ద్వారా క్రియలను కోరుతున్నాడు. నీ విశ్వాసానికి ఆత్మ నడిపింపు ఆత్మ వరములు, ఆత్మ ఫలములు ఎంతగానో అవసరము. అబ్రాహాము యొక్క విశ్వాసం చూడండి...అబ్రాహాం ఒక అన్యజనులలో నుండి పిలువబడిన ఒక అన్యుడు. కుమ్మరి వృత్తి కలిగియున్నాడు. మట్టి బొమ్మలను చేస్తూ జీవిస్తున్న సమయంలో దేవుడు అతన్ని పిలిచాడు. ఆదికాండము 12:1:4. యెహోవా నీవు లేచి నీ దేశమునుండియు, నీ బంధువుల యొద్దనుండియు నీ తండ్రి ఇంటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామము గొప్ప చేయుదును. నీవు ఆశీర్వాదకరంగా ఉందువు. నిన్ను ఆశీర్వదించినవారిని ఆశీర్వదించెదను. నిన్ను దూషించినవారిని శపించెదను. భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడునని అబ్రాహాముతో అనగా యెహోవా అతనితో చెప్పిన ప్రకారం అబ్రాహాము వెళ్లెను. లోతు అతనితో కూడా వెళ్లెను. అబ్రాహాము హారా నుండి బయలుదేరునప్పుడు డెబ్బదియేడేండ్ల ఈడు కలవాడు. అబ్రాహామును మొదట పిలిచినప్పుడు అబ్రాహాము పేరు అబ్రాంగా ఉండెను. దేవుడు పిలిచి అబ్రాహాముగా అతని పేరును మార్చినాడు. దేవుడు నిన్ను పిలచినప్పుడు నీ పరిస్థితులను

మార్చివేస్తాడు. నీకున్న విశ్వాసాన్ని బట్టి నీతో ఆయన కార్యములు జరిగిస్తాడు. నీ విశ్వాసమే నిన్ను స్వస్థపరుచును. లేక నీ విశ్వాసమే నిన్ను బాగు చేయును అని యేసుక్రీస్తుల వారు బోదించారు. ఒక శతాధిపతి యేసుక్రీస్తు దగ్గరకు వచ్చి అయ్యా! నా కుమారుడు మరణకరమైనటు వంటి రోగములో ఉన్నాడు. మీరు మాటమాత్రమే సెలవిచ్చిన యెడల నా కుమారుడు స్వస్థపరచబడును అని శతాధిపతి యేసుప్రభువను వేడుకొన్నాడు. యేసుప్రభువు అన్నాడు ఇంతటి గొప్ప విశ్వాసం ఉన్న వారిని ఇశ్రాయేలులో నేను చూడలేదు. వెళ్లు ఈ ఘడియలోనే నీ కుమారుడు స్వస్థత పొందుతాడు అని అనగానే ఆ ఘడియలోనే శతాధిపతి యొక్క కుమారుడు స్వస్థత పొందుకున్నాడు.

మనము దేవుని మీద విశ్వాసం ఉంచినప్పుడు దేవుడు కార్యములు చేయగలడని, విశ్వాసం ద్వారా మనము దాన్ని దేవుని యొద్ద నుండి మనము పొందుకుంటామని మొదటగా దేవున్ని నమ్మాలి. అప్పుడు దేవుడు సమస్తము మనకు అనుగ్రహిస్తాడు. కేవలము నమ్ము! సమస్తము సాధ్యమే. దేవుడన్నాడు నువ్వు ఊరికనే నిలబడి నా మహిమను చూడు అన్నాడు. నీవు దేవునియందు విశ్వాసం ఉంచి ఈ రోజు దేవుని మహిమను చూడు. అబ్రాహాము యొక్క జీవితంలో అబ్రాహామును గొప్పగా దీవించాడు. మొదటగా అబ్రాహామును పిలిచి నీ దేశమును, నీ బంధువులను నీ తండ్రియింటిని విడిచి నేను చూపించుచున్న దేశమునకు వెళ్లమని అబ్రాహాముతో చెప్పాడు. అబ్రాహాము దేవునియందు విశ్వాసం ఉంచి వెళ్లినాడు. సమస్త అవిశ్వాసాన్ని, అన్య ఆచారాలను వదిలి విశ్వాసంతో దేవున్ని వెంబడించాడు. అందుకనే దేవుడు ఈ రోజు అబ్రాహామును విశ్వాసులకు తండ్రిగా నియమించాడు. ఎప్పుడైతే అబ్రాహాము లౌకిక క్రియలను వదిలిపెట్టినాడో పరలోక ఆశీర్వాదాలను దేవుడు అబ్రాహాముకు అనుగ్రహించాడు. అబ్రాహాము దేవునియందు విశ్వాసం ఉంచి, ఆయన వాక్యమందు విశ్వాసముంచి దేవున్ని వెంబడించినాడు. నీవు విశ్వాసం ఉంచినపుడు దేవుని యొక్క వాక్యముపైన పరిపూర్ణమైన విశ్వాసాన్ని, నమ్మకాన్ని వుంచాలి. ఈవాక్యము మొదటగా ప్రవక్త



దగ్గరికి వస్తుంది. ఎందుకనగా దేవుడే తనయొక్క వాక్యానికి స్వంత అనువాదికుడైయున్నాడు. ఆమోసు గ్రంథం 3:6-8 పట్టణమందు బాకా నాదము వినపడగా జనులకు భయము పుట్టగా? యెహోవా చేయునది పట్టణములో ఉపద్రవము కలుగగా? తన సేవకులైన ప్రవక్తలకు తాను సంకల్పించిన దానిని బయలుపరచకుండా ప్రభువైన యెహోవా ఏమియు చేయడు. సింహము గర్జించెను భయపడనివాడు ఎవడు? ప్రభువైన యెహోవా ఆజ్ఞ ఇచ్చి యున్నాడు. ప్రవచించకుండా ఉన్నవాడెవడు? యోహాను 10:1-5, 34-35 హెబ్రీయులకు 1:1-2, 2తిమోతి 3:15-16 మరియు 2పేతురు1:20-21. దేవునికి తెలుసు తాను ఒక మాట ఇస్తే దానిని వెనుకకు తీసుకోడు. ప్రవక్త విలియం బ్రెన్‌హాం గారు అన్నారు దేవుని యొక్క బలహీనత ఏమనగా తాను మాట ఇస్తే వెనుకకు తీసుకోడు. ఎట్టి పరిస్థితుల్లోను కూడా ఆయన తన మాటను వాక్యాన్ని, వాగ్దానాలను నెరవేర్చుటకు సమర్థుడు, శక్తిమంతుడైయున్నాడు. భూమి మార్పునొందినను నడిసముద్రములో నీరు ఘోషించి నురుగులుకట్టినను, సృష్టిలో మానవునిలో ఎన్ని మార్పులు వచ్చినను దేవుడు తన వాక్యాన్ని ఇప్పటికీ, ఎప్పటికీ, ఎన్నటికీ మార్పులేనిదిగా యున్నది. దేవునికి మహిమ కలుగును గాక! ప్రభువైన యేసుక్రీస్తుకు స్తుతి, ఘనత, మహిమ, ప్రభావములు యుగయుగములకు కలుగును గాక! హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 13:8. యేసుక్రీస్తు నిన్న, నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు. అవును యుగయుగములకు ఒక్కటే రీతిగా ఉన్నాడు.

దేవుడు నోవహుతో ఎలా ఉన్నాడో, మండుచున్న పొదలోనుండి మోషెతో ఎలాగు మాట్లాడినాడో అలాగే అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు ప్రవక్తలు ఇంకా శిష్యులతో ఎల్లా ఉన్నాడో ఆయన నేడు కూడా అలాగనే ఉన్నాడు. ఇదిగో యుగసమాప్తి వరకు నేను మీకు తోడుగా ఉంటానన్నాడు. లోకము నన్ను చూడదు కానీ మీరు నన్ను చూస్తారు అని యేసుక్రీస్తు అన్నాడు. ఆయన నేటికి ఆత్మలో వాక్యములో, ప్రత్యక్షతలో సజీవంగా ఉన్నాడు. నీవు దేవునియందు విశ్వాసం ఉంచితే ప్రవక్తలతో మాట్లాడిన విధంగా నేడు దేవుడు నీతో కూడా మాట్లాడతాడు.

ఎందుకనగా ఆయన మారలేదు, ఆయన కార్యాలు మారలేదు, ఆయన వాక్యము మారలేదు. కానీ నీ విశ్వాసములో మార్పులు వస్తున్నాయి. ప్రతిరోజు విశ్వాసం ఉంచుతూ దేవునిలో జీవించాలి. మారని ప్రభువైన యేసుక్రీస్తు నీలో ఉన్నాడు. నీ విశ్వాసంలో ఉన్నాడు, నీ క్రియలల్లో ఉన్నాడు. ఆయన మారని విధంగా నీ విశ్వాసం ఎన్నటికీ మారకూడదు. అది ఎటువంటి పరిస్థితియైనా, ఆర్థిక ఇబ్బందులైనా శరీర అస్వస్థతయైనా అన్ని పరిస్థితులల్లో మన విశ్వాసంతో దేవున్ని ఆరాధించాలి. దేవుడు మనకు విశ్వాసం రానికి సంఘ పరిచర్యలను ఏర్పాటు చేసియున్నాడు. కొందరిని అపోస్తలులు గాను, కొందరిని సంఘకాపరులుగాను కొందరిని సువార్తీకులుగాను, మరికొందరిని ఉపాధ్యాయులుగాను అలాగనే సంఘంలో కొందరిని విశ్వాసులుగాను దేవుడు ఏర్పాటు చేసుకున్నాడు.

దేవుడు ఎక్కువగా ప్రవక్తలోతోనే మాట్లాడతాడు. వారిని పరీక్షలకు గురిచేస్తాడు సంఖ్యాకాండము 12:6 ద్వితీయోపదేశకాండము 13:1-5 మరియు 18:15-21. ప్రవక్తలకు దేవుడు తన వాక్యాన్ని మొదటగా బోధిస్తాడు. తన యొక్క ప్రజలకు ఇవ్వవలసని దీవెనలను, శాపములను రాబోయే ఉగ్రత దినములను దేవుడు ముందుగానే ప్రవక్తకు తెలియజేసి, ప్రవక్త ద్వారా దేవుడు సంకల్పించుకున్న విషయాన్ని ప్రజలకు తెలియజేస్తాడు. ఇప్పుడు ప్రవక్త దేవుని వాక్యానికి మధ్యవర్తిగా ఉంటాడు. ప్రవక్త దగ్గర యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు అను వాక్య నినాదాన్ని కలిగి ఉంటాడు. ప్రవక్తలు ఎటువంటి పరిస్థితైనా మరణకరమటువంటి పరిస్థితైనా, శ్రమలైనా, శోధనలైనా, ఇబ్బందులైనా వారు విశ్వాసంతో వాక్యమైయున్న దేవునితోనే నిలబడతారు, నడుస్తారు, జీవిస్తారు. దేవునికి మహిమ కలుగును గాక!

ద్వితీయోపదేశకాండము 4:2, ప్రసంగి 3:1-17, యెషయా 55:8-11, మత్తయి 24:36, గలతీయులకు 1:8-9 మరియు ప్రకటన గ్రంథము 2:16-20 ఈ వాక్యములలో మనకు ఏమి బోధిస్తున్నదంటే దేవుడు పరిపూర్ణుడు ఆయన



వాక్యము పరిపూర్ణమైనది. మానవుడు విఫలమైనా ఈ సర్వసృష్టి విఫలమైపోయినా దేవుని వాక్యము ఎన్నటికి విఫలము కాదు. ఎప్పుడు తప్పులోనికి వెళ్లదు. ఎప్పుడు తప్పు మార్గము ఆలోచించదు. దేవుని వాక్యము కేవలం నిన్ను పరిశుద్ధపరచి నిన్ను నిత్యజీవములోకి తీసుకెళ్తుంది. ఈ కార్యములు నీ విశ్వాసం పైన ఆధారపడి ఉంటాయి. అంత్యకాలంలో దేవుని యొక్క మర్మము సమాప్తమగుతుంది. అయితే కొంతమంది ప్రజలు దేవుని వర్తమానాన్ని నమ్ముతారు. కొంతమంది ప్రజలు దేవుని వర్తమానాన్ని నమ్మరు. ఎందుకనగా వారి పేర్లు గొఱ్ఱెపిల్ల జీవగ్రంథంలో వ్రాయబడలేదు. జగత్తు పునాది వేయబడకముందే లోక పునాదులు నిర్మించబడక ముందే దేవుడు ముందుగా ఎవర్ని ఎంచుకున్నాడు. వారిని పిలిచినాడు. పిలిచినవారిని మహిమపరిచినాడు. వారి పేర్లు మాత్రమే గొఱ్ఱెపిల్ల జీవగ్రంథంలో ఉంటాయి. వారు విశ్వాసం ఉంచుతారు. వారు విశ్వాసానికి కర్త అయిన దాన్ని కొనసాగించువాడైన యేసుక్రీస్తును, యేసువైపు చూస్తూ నడుస్తారు. వాక్యానుసారంగా జీవించి దేవుని యొక్క రెండవ రాకడలో వాక్యపు వధువుగా మారి సిద్ధపడి దేవుని రాకడలో మధ్యాకాశపు గొఱ్ఱెపిల్ల పెళ్లివిందులోనికి ఎత్తబడతారు.

నిర్గమ కాండం 3:2-5. దేవునితో, దేవుని వాక్యముతో, దేవుని పిలుపుతో, దేవుని విశ్వాసంతో ఎప్పుడు ఆటలు ఆడకూడదు. మోషె లాంటి ముఖాముఖి అనుభవం వచ్చేంతవరకు దేవుని బలిపీఠము ఎక్కి ప్రసంగించడానికి వీల్లేదు. నేటి బోధకులు ఆత్మ నడిపింపు లేకుండా ప్రార్థన లేకుండా స్వంత సిద్ధాంతములు స్వంత ఆలోచనలు ప్రజలకు బోధిస్తూ దేవుని పరిపూర్ణ వాక్యములోనుండి దేవుని పరిపూర్ణమైన వాక్యాన్ని బోధించట్లేదు. భిన్నమైనటువంటి సువార్తలు బోధిస్తున్నారు. పౌలు అన్నాడు మీరు భిన్నమైన సువార్తకు తిరిగి పోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నాడు. దేవుని వాక్యం వినకపోవడం వలన నీకు విశ్వాసం ఉండదు. ఎప్పుడైతే నీవు వాక్యం వింటావో వాక్యముతో నింపబడి దేవునియందు విశ్వాసం ఉంచుతావు.

దేవునికి అసాధ్యమైనది ఏది లేదు. ఈరోజు అనేక క్రైస్తవుల జీవితాలలో కార్యాలు చేయలేకపోతున్నాడు. కారణము వారి అవిశ్వాసము. మోషే ద్వారా ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తు దేశమును వదిలి కానాను దేశమునకు ప్రయాణమయ్యారు. మోషే నాయకత్వంలో, మోషే ఆధ్వర్యంలో ఆ ప్రయాణంలో వారికి సముద్రం అడ్డుగా వచ్చినప్పుడు మోషే ఇశ్రాయేలీయులు విశ్వాసం ఉంచి ప్రార్థించినప్పుడు దేవుడు సముద్రాన్ని రెండు పాయలుగా చీల్చినాడు. కారణం దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు దేవునిపై విశ్వాసం ఉంచడం ద్వారా సముద్రంలో ఆరిన నేలపై వారు ప్రయాణం చేసినారు. నేడు నీకు అటువంటి సముద్రం అనే అనేక సమస్యలు, పరిస్థితులు ఎదురవుతున్నాయి కావచ్చు. సముద్రంలో రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసిన దేవుడు నీవు విశ్వాసం ఉంచడం ద్వారా నీవెదుర్కొంటున్న పరిస్థితులల్లో దేవుడు నీకు మార్గాన్ని సిద్ధం చేస్తాడు. నీకివ్వబడిన విశ్వాసం ద్వారా మాత్రమే విశ్వాసాన్ని నువ్వు ఒక ఆయుధంగా ఉపయోగించాలి. ఇశ్రాయేలీయులకు అరణ్యంలో ఆహారం లేనప్పుడు వారు ఆహారము లేకుండా విలపిస్తున్నప్పుడు ఆ సమయంలో వారు విశ్వసించి ప్రార్థించడం ద్వారా దేవుడు ఆకాశం నుండి మన్నాను కురిపించి వారికి ఆహారాన్ని అనుగ్రహించాడు. ఇది విశ్వాసం ద్వారానే ఇశ్రాయేలుకు ప్రయాణమై వెళ్తున్నప్పుడు మోయాబీయులను చూసి వారిని మోహించి వ్యభిచరించినప్పుడు ఇరువై ఐదు వేల మంది అరణ్యములోనే కుప్పకూలి మరణించినారు. కారణం వారియొక్క అవిశ్వాసము, పాపాన్ని బట్టి. ఆజ్ఞ అతిక్రమమే పాపం. పాపం వల్ల జీతం మరణము. దేవుడు ఇశ్రాయేలీయులను సముద్రంలోనుండి నడిపించాడు, ఆహారము లేనప్పుడు ఆకాశం నుండి కురిపించి యిచ్చాడు. నీరు లేనప్పుడు బండ నుండి నీళ్లిచ్చాడు. మారాను మధురంగా మార్చినాడు. చివరికి వచ్చేవరకు అవిశ్వాసం ఉంచి విశ్వాసం నుండి అవిశ్వాసులుగా తొలగిపోయి, పాపం చేసి అరణ్యంలో మరణించినారు. దేవుడు మార్పులేనివాడు. నీవు విశ్వాసం ఉంచితే దేవుని దగ్గర నుండి గొప్ప కార్యములు పొందుకుంటావు. అన్ని వున్నప్పుడు



విశ్వాసం ఉంచడం కాదు, ఏమి లేనప్పుడు దేవునియందు విశ్వాసం ఉంచాలి. కష్టములు, రోగములు వచ్చినప్పుడు దేవునియందు విశ్వాసం ఉంచకుండా దేవుడు నాకు ఏమిచేశాడు అని దేవునిపైన మనం ఎప్పుడూ సనగకూడదు. దేవునికి నచ్చని మొదటి విషయం సనగడం లేక గునగడం. అవి వున్నవారు జీవితంలో తృప్తి పొందలేరు. దేవునిపైన సరియైన విశ్వాసం ఉంచలేరు. దేవుని సన్నిధికి వెళ్లలేరు. దేవున్ని ఆత్మతో, సత్యంతో ఆరాధించలేరు. ఎప్పుడైతే ఈ సనగడం లేక గునగడం వదిలిపెట్టి దేవుని యెడల కృతజ్ఞతా భావం కలిగిఉంటామో అప్పుడు దేవుడు మనల్ని ఆశీర్వదిస్తాడు. ఇశ్రాయేలు ప్రజలు అరణ్యయాత్రలో దేవుని పైన గునిగి, దేవునిపైన సనిగి దేవుని దాసుడైన మోషేకు వ్యతిరేకంగా లేచినపుడు వారు అరణ్యంలో సంహరించబడ్డారు. విశ్వాసం ఉంచినవారు మాత్రమే కానానులోకి చేర్చబడ్డారు. వారే యెహోషువా, కాలేబు. ఐగుప్తు దేశం నుండి 2 లక్షలతో బయలుదేరిన ఇశ్రాయేలు ప్రజలు అరణ్యంలో నలభై సం.లు సంచరించి ప్రయాణించి 2లక్షల మందిలో కేవలం ఇద్దరు మాత్రమే యెహోషువా, కాలేబులు మాత్రమే దేవుని చేత వాగ్దానము చేయబడిన పాలు, తేనెలు ప్రవహించు దేశమైనా కానానుకు వెళ్లినారు. నేటి దినాల్లో పిలువబడినవారు అనేకులు. కానీ ఏర్పర్చబడినవారు కొందరే. ఆ కొందరే చిన్న మంద మాత్రమే దేవునియొక్క రాకడలో ఎత్తబడుతుంది.

ఈ లోకంలో దేవునికి అసాధ్యమైనది ఏది లేదు. దేవునికి సమస్తము సాధ్యమే. మనము విశ్వాసము ఉంచినపుడు మన సమస్త పరిస్థితులను దేవుడు చక్కపెట్టగలడు. ప్రభువైన యేసుక్రీస్తు ఒకసారి సముద్రముపై ఓడలో తన శిష్యులతో కూడా ప్రయాణము చేస్తున్నపుడు సముద్రం మధ్యలోనికి ఓడ వెళ్లగానే బలమైనటువంటి గాలులు, తుఫాను సముద్రంలో చెలరేగినాయి. ఆ సమయంలో యేసుక్రీస్తు ఓడలో నిద్రిస్తున్నాడు. శిష్యులు గాలి తుఫానుకు భయక్రాంతులై కేకలు వేస్తున్నారు. ప్రభువా మేము నశించిపోతున్నాము. మమ్మల్ని కాపాడు, మమ్మల్ని రక్షించు అని కేకలు వేస్తున్నారు. శిష్యులనుకున్నారు ఈ సముద్రంలోనే

ఓడ మునిగి అందరం చనిపోతాము. అద్దరికి వెళ్లలేమనెటువంటి అనుమానంతో ఓడలో ఉండి భయపడుతున్నారు. సృష్టికర్త అయినటువంటి యేసుక్రీస్తును తమ యొక్క ఓడలో కలిగివుండి చనిపోయినవారిని లేపడం శిష్యులు చూసారు, కుంటివారిని, గ్రుడ్డివారిని, పక్షవాయువు గల వారిని ఇంకా అనేక రోగగ్రస్తులను ప్రభువైన యేసుక్రీస్తు స్వస్థపరచడం శిష్యులు చూసినారు. యేసుక్రీస్తును కలిగివుండియు, యేసుక్రీస్తు వారితో ఉన్న కూడాను వారు ఆ గాలి తుఫానుకు భయపడసాగారు. శిష్యులు వెళ్లి యేసుక్రీస్తును నిద్రలో నుండి లేపినారు. యేసుక్రీస్తు నిద్రలో నుండి లేచి గాలిని తుఫానును గద్దించినాడు. వెంటనే అవి నిమ్మలమైపోయినాయి. అప్పుడు శిష్యులను చూసి అల్పవిశ్వాసులారా ఎంతకాలం నేను మిమ్మును భరింతును అని వారి అవిశ్వాసాన్ని గద్దించెను. మన విశ్వాసం కూడా నేటి దినాల్లో అలాగే ఉన్నవి. భయం వచ్చినప్పుడు, గాలి తుఫాను లాంటి శ్రమలు మన జీవితంలో సంభవించినపుడు ప్రక్కనే ఉన్నటువంటి వాక్యము చదవము, చర్చికి వెళ్లము, విశ్వాసం ఉంచము కానీ, మన బంధువుల దగ్గరికి మన స్నేహితుల దగ్గరికి, డబ్బు అప్పు ఇచ్చేవారి దగ్గరకు వెళ్తాము. కానీ ఎవరు మనలను ఆదరించరు. అదేసమయంలో మనం ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసం ఉంచినపుడు, నిరీక్షించినపుడు దేవుడే మనకు సహాయకుడు. వాక్యంలో సెలవిస్తుంది. మనుష్యులను ఆశ్రయించుట కంటే రాజులను నమ్ముకొనుట కంటే యెహోవాను అనగా యేసుక్రీస్తును ఆశ్రయించుట మంచిది. మన శ్రమల్లో ఆయన యందు విశ్వాసం ఉంచాలి.

యోబు 2:3-10. యోబును చూడండి యోబు యొక్క విశ్వాసాన్ని దేవుడు పరీక్షించాడు. యోబు దేవునియందు ఎంతో భయభక్తులు కలిగినవారు. ప్రతిదినము కుటుంబ ప్రార్థన చేసేవారు. అపవాధి ఒకరోజు వచ్చి నీ భక్తుడైన యోబు గురించి నీవు ఒకసారి ఆలోచించావా? అతను నీయందు విశ్వాసం ఉంచాడు అని అపవాధి దేవునితో అంది. అపుడు దేవుడన్నాడు నీవు ఏమైనా చేయి, యోబు యొక్క ప్రాణాన్ని నీవు ఎట్టి పరిస్థితుల్లోను ముట్టకూడదు అని



అపవాధితో చెప్పినాడు. అప్పటినుండి యోబుకు అనేక శ్రమలు వచ్చునట్లుగా దేవుని వాక్యంలో మనం చూస్తున్నాం. యోబు అనేక శ్రమలను తట్టుకొని ఇలా సాక్ష్యమిచ్చాడు. యెహోవా ఇచ్చెను. యెహోవానే తీసుకొనెను. యెహోవా నామమునకు స్తుతి కలుగును గాక! అని యోబు దేవున్ని స్తుతించాడు. అతని జీవితంలో అన్ని కోల్పోయినను దేవుని యందలి విశ్వాసాన్ని దేవునియందలి భయాన్ని దేవునియందలి నిరీక్షణను ధైర్యాన్ని యోబు తన జీవితంలో కోల్పోలేదు. అతనికి ఇవ్వబడిన భార్య కూడా యోబు దగ్గరకు వచ్చి యోబును దూషించి నీవు ఇంకా ఎందుకు బ్రతుకుతున్నావు దేవున్ని దూషించి మరణముగా అని యోబును దూషించింది. అపుడు యోబు మూర్ఖురాల వలె మాట్లాడవద్దు. దేవుడు తిరిగి ఇచ్చుటకు సమర్థుడు, శక్తివంతుడు అని యోబు దేవునిపైన నమ్మకముంచాడు. ఆ దేశంలో యోబును అనేకులు దూషించినారు. అనేకరకాలుగా మాట్లాడినారు. అయినా యోబు ఎవరి మాటలయందు విశ్వాసముంచక ఎవరిని నమ్మక కేవలం దేవున్ని మాత్రమే తన జీవితంలో ఆరాధించి దేవున్ని మహిమపరచాడు. ప్రియ దేవుని బిడ్డ! నీవు కూడా ఈ రోజు యోబులాంటి పరిస్థితుల్లో ఉన్నావా? ఒకప్పుడు అన్నీ కలిగి జీవించి ఈ రోజు ఏమిలేని పరిస్థితుల్లో ఉన్నావా? ప్రభువైన యేసుక్రీస్తు మరియొక సారి నీ జీవితంలో ఆశీర్వాదాన్ని, దీవెనను పునరుత్థానాన్ని ఆయన యొక్క జీవాన్ని కలుగజేయుటకు సమర్థుడు. కోల్పోయిన నీ సంతోషాన్ని ఆశీర్వాదాన్ని దేవుడు తిరిగి విశ్వాసం ద్వారా నీకు అనుగ్రహిస్తాడు. యోబును కూడా రెండంతలుగా దేవుడు దీవించాడు. యోబు 42:10 మరియు యోబు తన స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేసినపుడు యెహోవా అతని క్షేమస్థితిని మరలా అతనికి దయచేసెను. మరియు యోబునకు పూర్వం కలిగినదానికంటే రెండంతలు యెహోవా అతనికి దయచేసెను. నీ జీవితంలో కూడా నీకు కలిగిన స్థితిలో నీవు విశ్వాసం ఉంచినపుడు దేవుడు రెండంతలు ఆశీర్వాదాలు నీకు కలుగజేస్తాడు, కలుగజేయుటకు సిద్ధంగా ఉన్నాడు. మొదటగా నీవు నమ్మాలి. దేవుని యొద్దకు వచ్చువారికి ఆయనను వెదుకువారికి నమ్ము ప్రతివానికి ఫలము

దయచేయును గదా అని విశ్వసించాలి. దేవుని విశ్వాసం నీ దగ్గరికి ఆత్మవాక్యం ద్వారా అనగా దేవుని యొక్క ఆలోచనల ద్వారా దేవుడు నిన్ను సమీపిస్తాడు. నీతో మాట్లాడతాడు. నిన్ను బలపరుస్తాడు. నీతో నడుస్తాడు. నిన్ను ఆశీర్వదిస్తాడు. ఆయన వాక్యపు ఆలోచనలు ఆత్మ ద్వారా నీకు బోధించి నీలో విశ్వాసాన్ని బలపరచి నిన్ను పరలోకం వైపు నడిపిస్తాడు. దేవుని ఆత్మ నీ మీదికి వచ్చినపుడు నీలో విశ్వాసం బలపడుతుంది. అవిశ్వాస తొలగిపోతుంది.

దేవుడు మానవున్ని విశ్వాసం, వాక్యముతో నడిపిస్తాడు. కానీ నేటి సంఘములలో స్వంత ఆచారాలు సిద్ధాంతాలతో వాక్యాన్ని బోధించకుండా వారి స్వంత సిద్ధాంతాలను బోధిస్తూ ప్రజలను దేవునికి దూరంగా నడిపిస్తున్నాడు. గ్రుడ్డికాపరులైయున్నారు. గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి దారి చూపడు కదా. ఇద్దరువెళ్ళి గుంటలో పడతారని యేసుక్రీస్తు తెలియజేసినాడు. కనుక మన విశ్వాసములో గ్రుడ్డివారము కాక, వాక్యములో గ్రుడ్డివారము కాక అన్ని ఆత్మీయ విషయాలలో ప్రత్యక్షత, ఆత్మవివేచన కలిగియుండాలి. అప్పుడు దేవుని యొక్క వాక్య ఆలోచనలతో నడిపించబడతాడు. వాక్యం వెంబడి వాక్యం సూత్రం వెంబడి సూత్రం యెషయా 28:8-13, ప్రకటన 1:3.

అపోస్తలులకు దేవుడు తనయొక్క ఆత్మను అనుగ్రహించి వారికి ఆత్మశక్తి ద్వారా వారికి పరిపూర్ణమైన వాక్యాన్ని అందించినాడు. కానీ శిష్యులు మరణానంతరం రోమా దేశంలో క్యాథలిక్ చర్చి వారు క్రీ.శ. 325 సం.లో నైసియాలో ఒక ఆలోచన సభ నడిపినారు. అందులో దేవుని వాక్యానికి బదులుగా మనుష్యులు కల్పించిన పద్ధతులు, త్రిత్వ బోధలు, బైబిల్‌లో లేని పండుగలు ఇంకా అనేకమైనటువంటి మనుష్యులు కల్పించిన సిద్ధాంతములు నైసియా సభలో ప్రవేశపెట్టి వాటిని ఆమోదింపచేసి ప్రపంచవ్యాప్తంగా నేడు అవి వెళ్లిపోయాయి. అవి సొదమ, గొమొఱ్ఱాల వలె మారిపోయినాయి. కానీ దేవుడు ఇపుడు తన వాక్యపు వధువును లోకములోనుండి సంఘ శాఖల్లోనుండి సంఘశాఖల బంధకం



నుండి విడిపించి వాక్యముతో ముందుకు నడిపిస్తున్నాడు. వధువు వాక్యాన్ని కలిగి వుంటుంది. వాక్యాన్ని కలిగివుంటే విశ్వాసాన్ని కలిగి ఉన్నట్టే. విశ్వాసాన్ని కలిగి ఉంటే నీవు దేవునితో కూడా అంటుగట్టబడినట్టే. అపుడు నీవు సంఘంలో వాక్యపు శరీరములో వాక్యముతో కడుతున్న దేవుని శరీరంలో నీవు గుర్తించబడతావు. నీ విశ్వాసం గుర్తించబడుతుంది. దేవుడు ఏర్పర్చిన వారు దేవున్ని నమ్మి వాక్యానుసారమైన జీవితంతో ఈ లోకంలో జీవిస్తారు. కానీ నేటి సంఘాలలో పేరు, పలుకుబడి, డబ్బు, హోదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి వాక్యానికి బదులుగా. అప్పుడే దేవుడొస్తాడు నిజమైనటువంటి వాక్యవధువును తీసుకొని వెళ్తాడు. ఆయనయందు నిరీక్షణ ఉంచి, విశ్వాసం ఉంచినవారిని ఏనాటికి సిగ్గుపర్చనీయడు. ఆయన ఖచ్చితంగా వస్తాడు. ఇది సత్యం యెషయా 28:12-13, 2థెస్సలొనికయులకు 2:7, ప్రకటన 3:20; 18-4.

రక్తం విశ్వాసం ద్వారా మట్లాడుతుంది. ఏలయనగా హేబేలు మరణించిన తర్వాత రక్తం మాట్లాడింది. దేవునికి మొరపెట్టింది. అలాగే నేటి క్రైస్తవులు నీతికరణ, శుద్ధీకరణ పరిశుద్ధాత్మ ప్రాణాత్మ శరీరములు అన్ని ఏకీభవించగా అనగా ఐదు జ్ఞానేంద్రియములు ఏకీభవించినపుడు విశ్వాసం అనే ఆరవ జ్ఞానేంద్రియం ఏర్పడుతుంది. దేవుడు ఎల్లప్పుడు విశ్వాసమనే ఆరవ జ్ఞానేంద్రియం ద్వారానే పనిచేస్తాడు. ఇపుడు జరుగుచున్న పోరాటం మన శరీరంలో ఉన్న ఐదు జ్ఞానేంద్రియములకు, ఆరవ జ్ఞానేంద్రియమైన విశ్వాసమునకు, మన శరీరమునకు ఒక జ్ఞానేంద్రియమైన చూపు అంటుంది నువ్వు వాక్యాన్ని చూడకు, యేసుక్రీస్తును చూడకు, ఆయన సంఘాన్ని చూడకు అంటుంది. కానీ విశ్వాసమైతే నీవు దేవున్ని చూడు, వాక్యాన్ని చూడు, ఆయన కార్యాలను చూడు అంటుంది. శరీర జ్ఞానేంద్రియమైన వినికిడి నువ్వు వాక్య స్వరం వినకు, దేవుని కార్యాలను వినకు అంటుంది. కానీ ఆరవ జ్ఞానేంద్రియమైన విశ్వాసం ఎల్లప్పుడు దేవుని వాక్యము మాత్రమే వినమంటుంది. చివరికి ఆరవ జ్ఞానేంద్రియమైన విశ్వాసమే గెలుస్తుంది. ఇపుడు నీ జీవితంలో నీవు ఏమి కలిగివున్నావు. ఏ జ్ఞానేంద్రియంతో

జీవిస్తున్నావు. ఐదు శరీరకరమైన జ్ఞానేంద్రియములను విడచి దేవుని వల్ల ఇవ్వబడిన ఆరవ జ్ఞానేంద్రియమైన విశ్వాసాన్ని నీ జీవితంలో కలిగి వుండు. అపుడు నీవు నీ జీవితంలో దేవుడు నీవు అనుకున్న కార్యాన్ని జరిగిస్తాడు. మీ సంతోషము పరిపూర్ణమగుటకు నీకు ఏది ఇష్టమో అడుగుడి, అవన్నియు నీకు అనుగ్రహించబడెనని యేసుక్రీస్తుల వారు వాక్యములో సెలివిచ్చారు.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 11:1-13,40. విశ్వాసమనునది నిరీక్షించబడు వాటి యొక్క నిజస్వరూపములు అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువైయున్నవి. దానిని బట్టియే పెద్దలు సాక్ష్యము పొందిరి. ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు అందును బట్టి దృశ్యమైనది కనబడెను. పదార్థములచే నిర్మించబడలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము. విశ్వాసాన్ని బట్టి హేబేలు కయీను కంటె శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించెను. దేవుడు అతని అర్పణల గూర్చి సాక్ష్యమిచ్చినపుడు అతని విశ్వాసాన్ని బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు. విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుంటునట్లు కొనిపోబడెను. అతడు కొనిపోబడకమునుపు దేవునికి ఇష్టుడయి వుండెనని సాక్ష్యము పొందెను. కాగా దేవుడతనిని కొనిపోయెను గనుక అతడు కనబడలేదు. విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడైవుండుట అసాధ్యము. దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు తన్ను వెదుకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా! విశ్వాసముము బట్టి నోవహు ఆదివరకు చూడని సంగతులను దేవుని చేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన ఇంటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. అందువలన అతడు లోకము మీద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను. అబ్రాహాము పిలువబడినపుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపుకు లోబడి తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలువెళ్లెను మరియు ఎక్కడికి వెళ్లెనో అది ఎరుగక బయలు వెళ్లెను. విశ్వాసాన్ని బట్టి అతడు అతనితో ఆ



వాగ్దానమునకు సమాన వారసులైన ఇస్సాకు, యాకోబు అనువారును, గుడారములలో నివసించు అన్య దేశములో ఉన్నట్టుగా వాగ్దత్తదేశములో పరవాసులైరి. ఏలయనగా దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునైయున్నాడో, పునాదులుగల ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురుచూచుచుండెను. విశ్వాసమును బట్టి శారాయు వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడని యెంచుకొనెను గనుక తాను వయస్సు గతించినదైనను గర్భము ధరించుటకు శక్తిపొందెను. అందుచేత మృతతుల్యుడైన ఆ యొకని నుండి సంఖ్యకు ఆకాశ నక్షత్రములవలెను, సముద్రమందలి లెక్కింపశక్యము కాని ఇసుక వలె సంతానము కలిగెను. వీరందరు ఆ వాగ్దాన ఫలము అనుభవింపకపోయినను దూరము నుండి చూచి వందనము చేసి తాము భూమి మీద పరదేశులము, పరదేశు లమును, యాత్రికులమై యున్నామని ఒప్పుకొని విశ్వాసము గలవారై మృతినొందిరి. వీరందరు విశ్వాసం ద్వారా సాక్ష్యము పొందినవారైనను మనము లేకుండా సంపూర్ణులుగా కాకుండు నిమిత్తము దేవుడు మన కొరకు మరి శ్రేష్ఠమైన దానిని ముందుగా సిద్ధపరచెను. గనుక వీరు వాగ్దాన ఫలము అనుభవించలేదు.

చివరికాల వర్తమానికుడైన విలియం బ్రెన్‌హాం గారి ద్వారా దేవుడు తన వాక్య వధువును సిద్ధపరుస్తున్నాడు. ఈ వర్తమానంలో నిన్ను జగత్తు పునాదులు వేయబడకముందే, లోకపునాదులు నిర్మించబడకముందే ఎన్నుకున్నాడు. అందుకనే వర్తమానం నీ దగ్గరకు వచ్చింది. నీవు దేవుని గొఱ్ఱెపిల్లవు. ఆయన స్వరాన్ని వింటున్నావు. ఆయనను వెంబడిస్తున్నావు. ఆయన చేతిలో నుండి నిన్ను ఎవరు తొలగింపలేరు. నీకివ్వబడిన విశ్వాసము ద్వారా నడుస్తూ మరణం వరకు ఆయనకు నమ్మకముగా ఉండు. దేవుడు మిమ్ములను దీవించునుగాక!

******

# ...And a High Cloud Ring of Mystery




Hovering like a giant's smoke ring, a great cloud appeared at sunset over Flagstaff, Ariz. last Feb. 28 and set off a continuing scientific mystery. Watchers struck by the cloud's odd shape and huge size, took pictures, like these four, at different times and from widely scattered locations in the state. Dr. James McDonald, a meteorologist at the Institute of Atmospheric Physics in Tucson, has been accumulating the pictures. Using them as the basis for trigonometric calculation, he has made a startling discovery that the cloud was at least 26 miles high and 30 miles across. "It is higher and bigger," he says, "than a cloud should be." The circle was too high to be made by a jet plane, and so far as Dr. McDonald can determine, there were no rockets, rocket planes or bombs being tested nearby that day. He hopes anyone else with pictures will lend them to him, for he would like some more clues about the cloud 26 miles up - no water droplets exist at that height to make a cloud.



5:10 P.M., N.E. OF PRESCOTT



6:15 P.M., N. OF PHOENIX




6:30 P.M. W.N.W. OF WINSLOW



కల్వరి ప్రింటర్స్, రాధిక టాకీస్ దగ్గర, వరంగల్. 9908863631

# From Faith to Faith



## విశ్వాసం నుండి విశ్వాసం వరకు



**ప్రభువైన యేసు క్రీస్తు**

LORD JESUS CHRIST



